సాక్షి
కుమురం భీం
మంగళవారం ౹ 20 ౹ మే ౹ 2025



కేజీబీవీల్లో మౌలిక వసతులు

కేజీబీవీల బాగుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.7,31,19,400 మంజూరు చేసింది. 8లో▸



ప్రమాదాల రహదారులు..!

చింతలమానెపల్లి మండలంలోని రహదారులపై భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయి. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /27.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడి తక్కువగా, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణ పనులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పనులు సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట రథసారథి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినకర్ అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దినకర్ మాట్లాడుతూ 1932లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి తన ఇంటి నుంచే పోరాటం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాస్, రాజేందర్, కార్తీక్, టీకానంద్, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా చేపట్టబోయే గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవా రం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాంను మర్యాదపూర్వకంగా కలి శారు. గోలేటి ఓసీపీ ఏర్పాటు పనులను వేగంగా చేపట్టి ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఒకప్పుడూ సింగరేణి గనులతో కళకళాడిందని ఆ సమయంలో ఎంతో మందికి ఉపాధి దొరికిందన్నారు. ప్రస్తుతం ఏరి యాలో ఒక్క గని మాత్రమే ఉండగా మరో మూడేళ్లలో ఆ ఒక్క ఓసీపీ సైతం మూతపడనుందన్నారు. ఈ సమయంలో జిల్లాలో కొత్తగా సింగరేణి గనుల ఏర్పాటు ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సింగరేణి నిధులు కేటాయించాలని కోరారు.

బీసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



నియామకపత్రం అందుకుంటున్న కిరణ్

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మామిడి కిరణ్‌ను నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సభ్యులు జక్కయ్య, మారుతీ పటేల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ.. కట్టలేం!



దహెగాం మండలంలోని దిగడలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో అమలు పర్చడానికి హౌసింగ్ అధికారులు అపసోపాలు పడుతున్నారు. 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినా.. కొందరు నేటికీ ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంలేదు. వారిని ఒప్పించడం అధికారులకు 'కత్తి మీద సాము'గా మారింది. దీంతో జిల్లాలో 749 ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి నోచుకోకుండా మిగిలిపోయాయి.

- పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక
- ఇళ్ల నిర్మాణానికి ముందుకురాని వైనం..
- నేటికీ అంగీకారం తెలుపని 749 మంది..
- రుణాలిప్పిస్తామంటున్న హౌసింగ్ అధికారులు
- రెండు గ్రామాల్లో అటవీ అధికారుల అభ్యంతరం

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో నియోజకవర్గానికి 3,500 చొప్పున రెండు నియోజకవర్గాలకు 7 వేల ఇళ్లు మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 మండలాల్లో 15 గ్రామ పంచాయతీలను మొదటి దశ కింద ఎంపిక చేసి వాటిలో పైలట్ ప్రాజెక్టు కింద 1,669 ఇళ్లు మంజూరు చేశారు. మండలానికి ఒకటి చొప్పున ఇందిరమ్మ నమూనా ఇళ్లను నిర్మించాల్సి ఉండగా 13 మండలాల్లో పూర్తయ్యాయి. ఒక్కో ఇంటిని 400 చదరపు అడుగుల్లో నిర్మిస్తే రూ.5 లక్షలు ఖర్చవుతుంది. నిర్మాణ పనుల తీరును బట్టి నాలుగు విడతల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం డబ్బును అందజేస్తుంది. ఇప్పటి వరకు 920 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. ఇందులో 215 ఇళ్లు పునాది దశకు చేరాయి. వీరందరికి మొదటి విడతగా రూ.లక్ష నగదు విడుదల చేశారు.

లబ్ధిదారుల అనాసక్తి...

మొదటి విడతలో జిల్లాకు 1,669 ఇళ్లు మంజూరు కాగా 920 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి అంగీకారపత్రాలు సమర్పించారు. కానీ 749 మంది మాత్రం నేటికీ అంగీకారపత్రాలు అందించలేదు. వెనుకబడిన జిల్లా.. గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతం కావడం వల్ల రూ.5 లక్షలు వెచ్చించి ఇళ్ల నిర్మాణం చేపట్టడం వారికి భారంగా మారిందని కొందరు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం.. ఇసుక ఆకాశన్నంటిన తరుణంలో అప్పు చేసి ఇళ్ల నిర్మాణానికి పూనుకున్న తర్వాత ప్రభుత్వం డబ్బులు ఇవ్వకుండా ఉంటే మా పరిస్థితి ఏమిటన్న వాదన కూడా ఉంది. లబ్ధిదారుల అనుమానాలపై హౌసింగ్ అధికారులు సమాధానం ఇవ్వడమే కాకుండా.. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇస్తున్నారు. ఒకవేళ ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేసి.. వారి పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక అటవీ అధికారులు అడ్డుకోవడంతో బెజ్జూరు మండలం సుశ్మీర గ్రామం, సిర్పూరు (టి) మండంలోని రావణపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. లబ్ధిదారులు మొదటిస్థాయి (ఎల్–1) కింద చూపిన స్థలాలు అటవీశాఖ పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ స్థానిక అటవీ అధికారులు అక్కడ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు.

జిల్లాలో 'ఇందిరమ్మ' పథకం అమలవుతున్న జీపీలు

మండలం	గ్రామ పంచాయతీ
ఆసిఫాబాద్	గోవిందాపూర్
వాంకిడి	జైత్‌పూర్
కెరమెరి	కోటారి
జైనూర్	మార్లవాయి
సిర్పూరు(యు)	పులార
లింగాపూర్	జముల్‌దర
తిర్యాణి	రొంపల్లి
రెబ్బెన	పాసిగాం
కాగజ్‌నగర్	మాలిని
సిర్పూర్(టి)	మేడిపల్లి
దహెగాం	డిగడ
పెంచికల్‌పేట్	లోడుపల్లి
బెజ్జూర్	సుశ్మీర
చింతలమానెపల్లి	బాబాపూర్
కౌటాల	నాగేపల్లి

దశల వారీగా నిర్మాణ చెల్లింపులు ఇలా...

పునాది	రూ.లక్ష
రూఫ్ లెవల్	రూ.1.25 లక్షలు
స్లాబ్	రూ.1.75 లక్షలు
పెయింటింగ్ పూర్తయ్యాక	రూ.లక్ష

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో మొదటి దశలో 749 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఆర్థికభారం పడకుండా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణా లు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. అయినా ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాకపోతే షోకాజ్ నోటీసు జారీ చేసి అర్హుల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తాం. రెండో దశ అర్హుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

– ఆర్.వేణుగోపాల్, ప్రాజెక్టు ఆఫీసర్, హౌసింగ్ విభాగం

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్‌నగర్‌కు చెందిన దుర్గం సంగీత తన కూతురుకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం ఎల్లారంకు చెందిన ఆరిందుల సుధాకర్ తాను కొనుగోలు చేసిన భూమికి పట్టా పాసుపుస్తకం ఇవ్వాలని, జైనూర్ మండలం సోను పటేల్ గూడకు చెందిన మిశ్రమ తూర్పుబాయ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ మండలం రహపల్లికి చెందిన మారిశెట్టి గురువయ్య తన భూమికి కొలతలు చేయించాలని, జైనూర్ మండలం ఊసేగాంకు చెందిన మడావి శ్యాంసుందర్ తనకు గ్రామ పంచాయతీలో కామాటీగా ఉపాధి కల్పించాలని దరఖాస్తులు సమర్పించారు.

ఏజెన్సీ భూములు కాపాడాలి



ఆసిఫాబాద్ మండలంలోని రహపల్లిలో గల ఏజెన్సీ భూముల్లో జరిగిన అక్రమ విరాసత్‌లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. అక్రమంగా విరాసత్ చేసిన భూములను 1959 షెడ్యూల్ ప్రాంతాల భూమి బదలాయింపు చట్టం సెక్షన్ (6) ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

– పిడుగు శంకర్, ఆసిఫాబాద్

న్యాయం చేయాలి



కాగజ్‌నగర్ మండలం బోడపల్లి శివారులో సర్వే నంబర్ 248/అ/2/3లో ఎకరం భూమిని 2020లో కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నా. కాని భూమిని అమ్మిన వ్యక్తి నాలుగో కుమారుని భార్య రాజకీయ బలంతో పట్టా చేసుకుంది. అధికారులు విచారణ జరిపించి అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తి పేరును తొలగించాలి.

– మొండి, అందెల్లి, కాగజ్‌నగర్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7 సెంటర్లలో 2,292 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందులో జనరల్ 2,057 మంది, ఒకేషనల్ 235 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఫస్టియర్ ఉదయం 9 నుంచి 12:30 వరకు సెకండియర్ మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు నిర్వహిస్తారన్నారు. జూన్ 3 నుంచి 13 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావ్



ఫిర్యాదు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్ రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, ఇతరులను కించపర్చేలా పోస్టులు చేస్తే గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్సై, సీఐలతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అనవసర విషయాలను, రాజకీయ నాయకుల, కులమతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను, ఇతరుల మనోభావాలను కించపర్చేలా పోస్టులు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పదోన్నతితో గుర్తింపు

పోలీసు శాఖలో పదోన్నతి పొందడం ద్వారానే గుర్తింపు లభిస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావ్ అన్నారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మీర్ ఉస్మాన్ అలీ, కౌటాల హెడ్ కానిస్టేబుల్ బాబాజీకి ఏఎస్సైలుగా పదోన్నతి లభించడంతో సోమవారం తన కార్యాలయంలో చిహ్నం అలంకరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎంటీవో అంజన్న, సీసీ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


అర్హులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న ఆంజనేయులు గౌడ్

రెబ్బెన: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ సోమవారం అడిషనల్ కలెక్టర్ డేవిడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కుమురం భీం జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలన్నారు. ప్రధానంగా బ్యాంకులు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. రుణాల మంజూరు విషయంలో గతంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని ప్రస్తుతం బీసీ ఇన్‌చార్జి ఈడీగా వ్యవహరిస్తున్న అధికారిని వెంటనే ఆ బాధ్యతల నుంచి తొలగించి మరో అధికారికి అప్పగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు అన్యాయం జరిగితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేశారని, దీంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిగెల మధుకర్‌గౌడ్, సోనాపూర్ గ్రామపటేల్ కుమురం దొందేరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తున్న వినియోగదారులు

కెరమెరి: నెలరోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని వార్డు నెంబర్ 1 కి చెందిన వినియోగదారులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడంలేదన్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌కు వచ్చినప్పటికీ బాధ్యత గల అధికారులెవరూ లేరన్నారు. స్థానికంగా ఉండాల్సిన అధికారులు జిల్లా కేంద్రాల్లో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఏఈ రమేశ్ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సుధాకర్, ఫాజిల్, ఇలి యాజ్, అహ్మద్, పోషెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- వానాకాలం సీజన్‌కు చురుగ్గా ఏర్పాట్లు
- విత్తనాలు, ఎరువుల సేకరణలో వ్యవసాయశాఖ
- తొలకరికి ముందే విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు



దుక్కి దున్ని సిద్ధంగా ఉంచిన చేను

రెబ్బెన(ఆసిఫాబాద్): వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. మరో పక్షం రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో రైతులు పంటల సాగుకు అవసరమైన పనుల్లో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి భూములు తడవడంతో రైతులు దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులను పొలాల్లో చల్లడం వంటి పనులు చేపడుతున్నారు. జిల్లాలో సాగు వనరులు అంతంత మాత్రంగానే ఉండటంతో రైతులు పూర్తిగా వర్షాధార పంటల సాగునే నమ్ముకున్నారు. దీంతో ఈసారి కూడా ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తే అధిక మొత్తంలో సాగు కానుంది. సాగునీటి వసతి అందుబాటులో ఉన్న రైతులు మాత్రం వరి సాగు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు.

పొడి దుక్కిలోనే విత్తనాలు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారు 4.45 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వర్షాధార పంటలైన పత్తి, కంది వంటి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తారని అధికారులు భావిస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో పత్తి పంటలను సాగుచేసే రైతుల తొలకరి వర్షాలకు ముందే పొడి దుక్కిలో విత్తనాలు విత్తుతూ వస్తున్నారు. ఈసారి సైతం ఇదే పద్ధతి కొనసాగించేలా కనిపిస్తున్నారు. అయితే తేలికపాటి భూముల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం, నల్లరేగడి నేలల్లో 75 మిల్లీమీటర్ల వర్షం నమోదైన తరువాతే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. తొలకరి వర్షాలు ఆశాజనకంగా పడితే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంటుంది. అలా కాకుండా అరకొరగా పడితే మాత్రం విత్తనాలు మొలకెత్తకుండానే భూమిలోనే చెడిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు మరోసారి విత్తనాలు విత్తుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

పొలం బాటలో రైతులు

వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లో పాత పంటల అవశేషాలను తొలగించడం, దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు తరలించడం వంటి పనులు చేపడుతున్నారు. జూన్ మొదటివారంలో తొలకరి వర్షాలు పడక ముందే పత్తి విత్తనాలను విత్తుకునేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. చాలా మంది రైతులు అవగాహన లేక వరికొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీంతో భూముల్లో ఉన్న సూక్ష్మపోషకాలు నశించి దిగుబడి తగ్గుతోంది. వరికొయ్యలను కాల్చడం కంటే భూమిలోనే కలియదున్నితే పంటలకు ఎంతో మేలు కలుగుతుందని అధికారులు చెప్పుతున్నారు.

వానాకాలంలో పంటల సాగు అంచనా (ఎకరాల్లో)

పత్తి	3,35,363
వరి	56,861
కంది	30,430
ఇతర పంటలు	22,395


వానాకాలం సీజన్‌కు కావాల్సిన విత్తనాలు

పత్తి ప్యాకెట్లు	6,70,727
వరి (క్వింటాళ్లలో)	14,215
కంది (క్వింటాళ్లలో)	1217.2

అవసరమైన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)


యూరియా	60,081
డీఏపీ	40,052
ఎంవోపీ	10,011
ఎస్ఎస్‌పీ	20,025
కాంప్లెక్స్	20,025

దుక్కిదున్ని సిద్ధంగా ఉంచిన



వానాకాలం పంట కోసం నెల రోజుల క్రితమే దుక్కిదున్ని భూమిని సిద్ధంగా ఉంచిన. గతేడాది తొలకరి వర్షాలకు ముందే పొడిదుక్కిలోనే పత్తి విత్తనాలు వేసిన. అరకొరగా వర్షాలు పడటంతో విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. దీంతో రెండు మూడు సార్లు విత్తనాలు విత్తుకోవాల్సి వచ్చింది. – ఎల్లయ్య, కౌలురైతు, గంగాపూర్

పత్తి, వరిసాగు చేస్తా



నాకున్న సొంత భూమిలో పత్తి పంటతో పాటు వరి పంటను సాగు చేస్తా. గతేడాది పత్తి పంటలో ఆశించిన దిగుబడి రాలేదు. అక్టోబర్ నుండే వర్షాలు పడకపోవడంతో పత్తి పూత రాలిపోయి దిగుబడి సగానికి సగం తగ్గింది. అరకొరగా వచ్చిన పత్తికి పెట్టుబడులు కూడా రాలేదు.

– మొర్లె ఎంకయ్య, రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



పెరిగిన కూలీలు, విత్తనాలు, ఎరువుల ధరలతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. ఖర్చులకు తగినట్లుగా పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రస్తుతం పెరిగిన ఖర్చులతో పత్తికి క్వింటాల్‌కు రూ.10వేలు, వరికి రూ. 5 వేల మద్దతు ధర కల్పిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది.

– గోపాల్, రైతు, నంబాల

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: 2025–26 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవేలబుల్ స్కూల్ పథకంలో పాఠశాలల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రతిపాదనలు ఈ నెల 24 వరకు కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన పాఠశాలలో బెస్ట్ అవేలబుల్ స్కూల్ పథకంలో ప్రవేశం పొందిన ఐదోతరగతి, పదవ తరగతి విద్యార్థులకు రూ.42 వేలు ఉపకార వేతనాలు, ఉచిత హాస్టల్, భోజన వసతి, 1వ తరగతి నుంచి 4వ తరగతి విద్యార్థులకు డే స్కాలర్ లో ఎంపికైన విద్యార్థులకు రూ.28 వేల ఉపకార వేతనాలు, ట్యూషన్‌తో పాటు పాఠ్య పుస్తకాలు, రెండు జతల దుస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9866853227 నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో ఎద్దులు మృతి

దస్తురాబాద్‌: విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎర్రగుంట గ్రామంలో సోమవారం జరిగింది. విద్యుత్‌ ఇన్‌చార్జి ఏడీఈ టి.శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట గ్రామానికి చెందిన రైతులు లావుడ్య కిషన్, నాగవత్‌ తులసీరామ్‌కు చెందిన ఎద్దులు ఆదివారం మేతకు వెళ్లి రాలేదు. సోమవారం గాలించగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మరణించి కనిపించాయి. ఎస్సై సాయికృష్ణ, రెవెన్యూ అధికారి సంతోష్‌ పరిశీలించి ప్రమాదంపై వివరాలు సేకరించారు. ఎడ్ల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని పశువైద్యాధికారులు సంధ్యారాణి, దేవీదాస్‌ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్‌: ఈ (2025–26) విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌ విద్యకు సంబంధించి కార్పొరేట్‌ కళాశాలల్లో ప్రవేశం కోసం ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ డీడీ అంబాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 7.0 జీపీఏ /400 మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు www.telanganaepass.cgg.gov.in ద్వారా ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్‌: దండేపల్లి మండల తహసీల్దార్‌ ఏ.సంధ్యారాణిని వేమనపల్లి మండలానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమీకృత కలెక్టరేట్‌ కార్యాలయంలో సీ సెక్షన్‌ సూపరింటెండెంట్‌గా ఉన్న తహసీల్దార్‌ క్యాడర్‌ ఎస్‌.సంతోష్‌కుమార్‌ను దండేపల్లి తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

దుప్పిని వేటాడిన ఇద్దరి రిమాండ్‌

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామం సమీపంలోని మామిడి తోటలో ఆదివారం చుక్కల దుప్పిని వేటాడిన దిమ్మదుర్తి గ్రామానికి చెందిన శివరాత్రి రాకేశ్, శివరాత్రి రాజశేఖర్‌పై సోమవారం కేసు నమోదు చేశారు. నిర్మల్‌ కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికీ రిమాండ్‌ విధించినట్లు దిమ్మదుర్తి ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌రావు తెలిపారు. కేసుతో సంబంధం ఉన్న మిగతా ఏడుగురిని రూ.10 వేల పూచీకత్తుపై విడుదల చేసినట్లు వెల్లడించారు.

జూదరుల అరెస్టు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్‌ తెలి పారు. పట్టణానికి చెందిన ఎంబడి వెంకటేష్, చిట్టుమల్ల రాకేష్, అబ్దుల్‌ జాఫర్, బుద్దె రాయమల్లు, సాజిద్, గౌస్, గోయికారి వినోద్‌ పేకాడుతుండగా పట్టుకున్నామన్నారు. రూ.2,720 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో మౌలిక వసతులు

- ఉమ్మడి జిల్లాకు రూ.7.31 కోట్లు
- పునఃప్రారంభంలోపు పనులు పూర్తి



మంచిర్యాల కేజీబీవీలో విద్యార్థులు, తల్లిదండ్రులు(ఫైల్‌)

మంచిర్యాలఅర్బన్‌: పేద, వెనుకబడిన, మధ్యలో బడిమానేసిన బాలికలకు విద్యనందించేందుకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ) బాగుకు ప్రభుత్వం నడుం బిగించింది. నాణ్యమైన విద్య వసతులు అందించడమే లక్ష్యంగా విద్యాలయాలు నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరిచి భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.7,31,19,400 మంజూరు చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రత్యేక అధికారులు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్ల సమన్వయంతో మౌలిక సదుపాయాల ఆధారంగా ప్రాధాన్యత ప్రాతిపదికన పనులు, మరమ్మతులు గుర్తించనున్నారు. విద్యాలయాల పునఃప్రారంభంలోపు అన్ని పునరుద్ధరణ, మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఉత్తర్వులు రావడంతో అధికారులు పనుల వేగవంతానికి చర్యలు చేపట్టారు.

మంచిర్యాల జిల్లాలో..

మంచిర్యాల జిల్లాలో 18 కేజీబీవీలు ఉన్నాయి. మూడింట్లో పదో తరగతి, 15 చోట్ల ఇంటర్మీడియెట్‌ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఇదివరకు 4,589 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. ఇటీవల ఐదు కేజీబీవీల్లో ఇంటర్‌ తరగతుల నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. రెండు చోట్ల రెండు, మూడు చోట్ల ఒకే కోర్సులో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. గదుల కొరత, సౌకర్యాల లేమి నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టనున్నారు. ఒక్కో కేజీబీవీకి రూ.4లక్షల నుంచి రూ.31లక్షల వరకు నిధులు మంజూరు కావడం ఊరటనిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	నిధులు మంజూరు
మంచిర్యాల	రూ.2,59,31,600
ఆదిలాబాద్‌	రూ.1,83,64,200
కుమరంభీం ఆసిఫాబాద్‌	రూ.1,46,52,800
నిర్మల్‌	రూ.1,41,70,800

చేపట్టనున్న పనులు ఇవే..

ఆయా కేజీబీవీల్లో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టనున్నారు. అంచనా వేసిన, గుర్తించిన పనులు సాగనున్నాయి. అదనపు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మాణం, అదనపు వసతిగృహాల నిర్మాణం, అదనపు కిచెన్‌ షెడ్ల నిర్మాణం, క్రీడా కోర్టుల నిర్మాణం, సెప్టిక్‌ ట్యాంకుల ఏర్పాటు, డ్రైనేజీ అవుట్‌లెట్ల ఏర్పాటు, సోలార్‌ ప్యానెల్స్, ఆర్వో ప్లాంట్ల సంస్థాపన, విద్యుత్‌ వైరింగ్, సానిటరీ ఫిక్చర్స్, ఫిట్టింగుల పూర్తి, ఇతర ముఖ్యమైన సివిల్‌ లేదా ఎలక్ట్రికల్‌ పనులు, అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయనుండడంతో దిశ మారనుంది.

280 క్వింటాళ్ల జొన్నల పట్టివేత

- ఏపీ నుంచి ఆదిలాబాద్‌ జిల్లాకు అక్రమంగా తరలింపు
- వేర్వేరు చోట్ల రెండు లారీలు సీజ్‌



సిరికొండలో పట్టుబడిన జొన్నల లారీ

నేరడిగొండ/సిరికొండ: ఆంధ్రప్రదేశ్‌ నుంచి జిల్లాకు అక్రమంగా జొన్నలను తరలిస్తున్న రెండు లారీలను నేరడిగొండ, సిరికొండ మండలాల్లో పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 280 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నారు.

నేరడిగొండలో 250 క్వింటాళ్లు..

నిర్మల్‌కు చెందిన ఓ ట్రేడర్‌ ఆంధ్రప్రదేశ్‌ నుంచి లారీలో 250 క్వింటాళ్ల జొన్నలను తరలిస్తుండగా వాంకిడి గ్రామ సమీపంలో సోమవారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. పంచనామా అనంతరం వ్యవసాయ శాఖ, పీఏసీఎస్‌ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

సిరికొండలో 30 క్వింటాళ్లు..

ఆంధ్రప్రదేశ్‌ నుంచి సిరికొండ మండలానికి జొన్నలను అక్రమంగా లారీలో తరలిస్తుండగా స్థానిక పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై శ్రీసాయి తెలిపిన ప్రకారం వివరాలు.. మండలంలోని రాంపూర్‌(బి) గ్రామానికి జొన్నల లోడుతో వచ్చిన లారీని ముందస్తు సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేశారు. ఏపీలోని గుంటూరు జిల్లా కావలి నుంచి 30 క్వింటాళ్ల జొన్నలను తీసుకొచ్చినట్లు గుర్తించారు. అయితే వీటిని ఎవరు తీసుకొచ్చారు.. ఎందుకు తీసుకొచ్చారు వంటి సమాధానాలు సదరు డ్రైవర్‌ పేర్కొనకపోవడం గమనార్హం. రెవెన్యూ అధికారుల పంచనామా అనంతరం పట్టుబడిన లారీని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చీఫ్‌ ఇంజినీర్‌ను కలిసిన నాయకులు



సత్యచంద్రకు పూలమొక్క అందజేస్తున్న టీఎన్జీవోస్‌ నాయకులు

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల జిల్లాకు బదిలీపైవచ్చి విధుల్లో చేరిన చీఫ్‌ ఇంజినీర్‌ ఆఫ్‌ ఇరిగేషన్‌ ఏ.సత్యచంద్రను సోమవారం టీఎన్జీవోస్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ఉపాధ్యక్షుడు శివప్రసాద్,పట్టణ అధ్యక్షుడు గోపాల్, రోశయ్య పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఉట్నూర్‌ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం 25 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ఎక్కువగా పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి పథకాల మంజూరు, రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నట్లు తెలిపారు. ఉట్నూర్‌ మండలం మార్కగూడకు చెందిన మధు తమ గ్రామానికి సోలార్‌ విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన గేడం శంకర్‌ బోర్‌వెల్‌ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదరస్వామి, ఈఈ తానాజీ, మేనేజర్‌ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్‌

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రాజేశ్‌మీనా



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేష్‌ మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌ కుమార్‌

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌లో గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం వివరాలను వెల్లడించారు. నిర్మల్‌కు చెందిన కషప్‌ సాయిప్రసాద్, పుట్ట శివకుమార్, షేక్‌ ముక్తార్‌ మౌలాన్, నిజామాబాద్‌ జిల్లాకు చెందిన ఉప్పు రాజ్‌కుమార్‌ గంజాయి అమ్మి ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని తక్కువ రేటుకు తీసుకువచ్చి, నిర్మల్‌లో ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఏఎస్పీ రాజేశ్‌మీనా ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌ స్థానిక బైల్‌ బజార్‌లో సోమవారం గంజాయి విక్రయిస్తున్న ఈ నాలుగురిని రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 1,200 గ్రాముల గంజాయి, ఒక ఆటో, స్కూటీ, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇందులో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుళ్లు వినయ్, అవినాష్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నేతల బాహాబాహీ

- పరిశీలకుల ఎదుటే గలాట
- మాజీ కౌన్సిలర్‌పై చేయి చేసుకున్న పీసీసీ సభ్యుడు
- పోలీసుల రంగ ప్రవేశం



చెన్నూర్‌ క్యాంపు కార్యాలయంలో నాయకుల వాగ్వాదం

చెన్నూర్‌: మంచిర్యాల జిల్లా చెన్నూర్‌ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌ పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో నాయకులు బాహాబాహీకి దిగారు. ఇరువర్గాలు కొట్టుకునే వరకు వెళ్లారు. రాష్ట్ర పరిశీలకుల ఎదుటే మాజీ కౌన్సిలర్‌పై పీసీసీ సభ్యుడు చేయి చేసుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. పరిశీలకులు రాష్ట్ర ఆయిల్‌ ఫర్టిలైజర్స్‌ చైర్మన్‌ జంగా రాఘవరెడ్డి, పీసీసీ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే, పరిశీలకులు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చాంబర్‌లోకి వెళ్లారు. అనంతరం సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బ్లాక్, మండల, పట్టణ, గ్రామ అధ్యక్షుల ఎన్నికల కోసం పరిశీలకులు చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్‌ మండలాల నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ కోసం పని చేసిన వారికి ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెన్నూర్‌ కాంగ్రెస్‌ నాయకుడు, మాజీ కౌన్సిలర్‌ పోగుల సతీష్‌ ఫిర్యాదు చేశారు. దీంతో పీసీసీ సభ్యుడు మందమర్రికి చెందిన పిన్నంటి రఘునాథ్‌రెడ్డి ఆయనతో ఘర్షణకు దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరినొకరు తోసుకున్నారు. సహనం కోల్పోయిన రఘునాథ్‌రెడ్డి సతీష్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో చెన్నూర్‌ నాయకులు ఆందోళనకు దిగారు. సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పార్టీ పరిశీలకుల ఎదుటే నాయకులు గలాటకు దిగడంతో కాంగ్రెస్‌ నాయకుల తీరు మారదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌ పాల్గొన్నారు.

పరిశీలకులకు ఫిర్యాదు..

ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ముఖ్య అనుచరుడు రఘునాథ్‌రెడ్డి సతీష్‌పై చేయిచేసుకున్న తీరును పరిశీలకులు రాఘవరెడ్డి, రాంభూపాల్‌రెడ్డిలకు జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ మూల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘించిన పీసీసీ సభ్యున్ని వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలని కోరినట్లు రాజిరెడ్డి వర్గీయులు తెలిపారు. సమావేశంలో ఘర్షణ జరుగుతున్నా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సంఘటన స్థలానికి రాకపోవడం గమనార్హం.

ఆర్టీసీ బస్సులో బంగారం అపహరణ

కౌటాల: ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన పెద్దపెల్లి రమ్య ఈ నెల 17న మంచిర్యాలలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మెడలోని మూడు తులాల బంగారు గొలుసు, అర తులం చెవి కమ్మలను తీసి కవర్‌లో పెట్టి తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచి సోమవారం కాగజ్‌నగర్‌ నుంచి ఆర్టీసీ బస్సులో చింతలమానెపల్లికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. విషయాన్ని డ్రైవర్‌కు తెలుపడంతో బస్సును కౌటాల పోలీస్‌ స్టేషన్‌ వద్ద నిలిపి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తనిఖీ చేసినా ఆభరణాలు లభించలేదు. బాధితురాలు రమ్య కేసు నమోదు చేయాలని కౌటాల ఎస్సై గుంపుల విజయ్‌ను కోరగా ఈ కేసు సిర్పూర్‌(టి) పరిధిలోకి వస్తుందని చెప్పడంతో నిరాశతో ఇంటికి వెళ్లిపోయింది. బస్సులో సురక్షిత ప్రయాణమని ఎక్కితే మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సైతం కేసు నమోదు చేయలేదని ఆరోపించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో రమ్య

సాత్నాల: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్‌ జిల్లా సాత్నాల మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరగిరి గ్రామానికి చెందిన కొక్కుల లచ్చన్న(52) కొంతకాలంగా తమకున్న మూడెకరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది పత్తి సాగు చేయగా సరైన దిగుబడి రాలేదు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పు, సాగుకు తెచ్చిన పెట్టుబడి కలిపి సుమారు రూ.5లక్షల వరకు ఉందని, వాటిని ఎలా తీర్చాలో అంటూ కొంతకాలంగా మదనపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన సోమవారం వేకువజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వద్ద ఉన్న మోదుగు చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రమ్య తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నర్సాపూర్‌(జి): మండలంలోని రాంపూర్‌ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌ గ్రామానికి చెందిన ఇరగదండ్ల ఎల్లన్న(50) ఈనెల 17న కల్లు తాగడానికి వెళ్తున్నానని కూతురు తిరుమలకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కల్లూరు గ్రామానికి వెళ్లి ఉండొచ్చని భావించారు. సోమవారం ఉదయం రాంపూర్‌ గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువులో ఒక వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందడంతో తిరుమల కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూశారు. తన తండ్రి ఎల్లన్న మృతదేహం అని గుర్తించారు. తన తండ్రి మృతికి కారణాలు తెలిపాలని తిరుమల చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలోపడి ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్‌: బావిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్‌ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన లేకురే రవీందర్‌(38) మద్యానికి బానిసయ్యాడు. మూడేళ్లుగా ఖాళీగా తిరుగుతున్నాడు. రోజు మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అతని భార్య కవిత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ బావిలో మృతదేహం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పేలిన బుష్‌ ఇన్సులేటర్లు



ఎగిసిపడుతున్న మంటలు

మందమర్రిరూరల్‌: పట్టణంలోని రెండవ జోన్‌ రైల్వేస్టేషన్‌ రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ బుష్‌ ఇన్సులేటర్లు సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా పేలి మంటలు ఎగిసిపడ్డాయి. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌ ఉండడంతో ఆయిల్‌ రోడ్డుపై పడింది. ఆ సమయంలో రోడ్డు గుండా ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. మంటలకు విద్యుత్‌ స్తంభానికి ఉన్న వైర్లు కాలిపోయాయి. విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. బుష్‌ ఇన్సులేటర్లలో గ్యాస్‌ ఏర్పడి పేలి ఉంటుందని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూస్తామని తెలిపారు.

ట్రాక్టర్‌ అదుపు తప్పి యువ రైతు మృతి

నర్సాపూర్‌(జి): నిర్మల్‌ జిల్లా నర్సాపూర్‌(జి) మండలం నందన్‌ గ్రామంలో ట్రాక్టర్‌ బోల్తా పడి యువ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నందన్‌ గ్రామానికి చెందిన సామ రూపేశ్‌రెడ్డి(35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం తన సొంత ట్రాక్టర్‌లో పొలానికి చెరువు మట్టి తరలిస్తుండగా చెరువు కట్ట మార్గంలో ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తాపడింది. ఇంజన్‌ ట్రాలీ మధ్యలో రూపేశ్‌రెడ్డి ఇరుక్కు పోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మహిళ మృతి

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్‌ పరిధి సోమగూడెం వారసంత సమీపాన ఉన్న సింగరేణి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ గది ఆవరణలో కుక్కల లలిత(48) మృతిచెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. చెల్పూర్‌ గ్రామానికి చెందిన ఆమె సోమగూడెంలోని కుటుంబీకుల వద్ద ఉంటూ మద్యానికి బానిసైందని పేర్కొన్నారు. సోమవారం మృతదేహం కనిపించింది. మృతురాలి కూతురు పెద్దపల్లి రమ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ నిర్మాణం అడ్డగింతలో ఉద్రిక్తత



నిర్మాణ పనులు నిలిపివేస్తున్న అధికారులు

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబరు 876లో ఇంటి నిర్మాణ పనులు సోమవారం అధికారులు అడ్డుకోవడం రసాభాసగా మారింది. ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు బయటకు రావడానికి నిరాకరించడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు మహిళను బయటకు తీసుకొచ్చే క్రమంలో స్పృహ కోల్పోవడంతో 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎంఆర్‌సీ భవనం ఎదుట కొనుగోలు చేసిన భూమిలో గీసరి సాయికుమార్‌ ఇంటి నిర్మాణం చేపట్టాడు. ప్రభుత్వ స్థలమని ఫిర్యాదులు రావడంతో రెండ్రోజుల క్రితం బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ ఇంటిని సీజ్‌ చేశారు. సాయికుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పనులు సాగుతున్నట్లు మరోసారి ఫిర్యాదు రావడంతో ఇంటిని సీజ్‌ చేసేందుకు డెప్యూటీ తహసీల్దార్‌ ప్రకాష్, ఆర్‌ఐ సులోచన, ఎస్సై ప్రసాద్‌ సిబ్బందితో కలిసి సోమవారం వెళ్లారు. ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు బయటకు వచ్చేందుకు నిరాకరించారు. గంటన్నరపాటు వారిని సముదాయించి బయటకు తీసుకొచ్చి ఇంటికి తాళం వేశారు. రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సాయికుమార్‌ వాపోయాడు. చుట్టుపక్కల నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా తనను అడ్డుకుంటున్నారని ఆరోపించాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిని సీజ్‌ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

సింగరేణి లాభాలు ప్రకటించాలి

శ్రీరాంపూర్‌: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించాలని బీఎంఎస్‌ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. యూనియన్‌ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి సోమవారం ఆర్జీ 3 ఏరియా పరిధిలోని సెంటినరీ కాలనీ క్యాంపు కార్యాలయంలో డైరెక్టర్‌(ప్రాజెక్ట్, ప్లానింగ్, పా) కొప్పుల వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం సమర్పించారు. కంపెనీ లాభాల నుంచి ఈసారి 40శాతం వాటా చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ప్రతీసారి లాభాల వాటా చెల్లింపులో జాప్యం జరుగుతోందని, ఈసారి ఆలస్యం చేయకుండా వాస్తవ లాభాలను ప్రకటించి వాటా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు రౌతు రమేష్, కన్నా రమేష్, కిరణ్‌ కుమార్, నల్ల వేణు, కందుల మహేష్‌ పాల్గొన్నారు.

యువకవుల సమ్మేళనం పోస్టర్ల విడుదల



మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల జిల్లా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే యువ కవుల సమ్మేళనం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం ఆయన నివాసంలో విడుదల చేశారు. జాగృతి నాయకులు ఐద ప్రశాంత్‌ మాట్లాడుతూ జూన్‌ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యువ కెరటాలు శీర్షికతో కల్వకుంట్ల కవిత అధ్యక్షతన హైదరాబాద్‌ తెలంగాణ సరస్వతి పరిషత్‌లో ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ అస్తిత్వం, తాత్వికత, జీవన విధానం చరిత్ర, భాష, సంస్కృతి, ఉద్యమం అనే అంశాలపై యువ కవులకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు మే 26లోపు మెయిల్‌(kavitha.telangana@gmail.com)కు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు పడాల రవీందర్, పుల్లూరి మౌనిక, రాకేశ్, బిల్లా మారుతి, గడ్డం మహేశ్, తోట రంజిత్, వికాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. టూటౌన్‌ ఎస్సై కే.మహేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి ఏరియా కాసిపేటగనిలో కోల్‌ కట్టర్‌ బానోత్‌ పృథ్వీరాజ్‌ ఆదివారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై తాండూర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి మందమర్రికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో బైపాస్‌ రోడ్డు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ముందు ఎదురుగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. పృథ్వీరాజ్‌ కాలు పాదం వద్ద నుజ్జునుజ్జయింది. స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు, అక్కడి నుంచి సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.